# న్యాయమేది! అన్యాయమేది??

రాజేంద్ర



ఆ పాడవానంల ఉశా ఏడు ఆసలు కురువలేదు. ఆనలు అసలేరు (ఆశ్లేష) కార్తిల ఆనలు కురుత్తె ముసలెద్దు లేంక తేత్తది అని అంటరు. ఇగ అండ్లనే ఆనలు కురువక మందుటెండలు కొడ్తె ఇంకే ముంటది. పోయినేడు గిట్లనే అయింది. ఈ ఏడన్న ఆనలు కురుత్తయ్యేమోనని రైతులు, పాలేర్లు అనుకున్నారు. బూపాలకంటె గరిసెలనిండ ఇత్తనాలుండె. త్రిజోడీల నిండ పైస ఉండె. మొదాట కొట్టి ఆటెంక ఆనలు కురువక పోయె వరకల్లా పునాసపంట అంతపాడై పోయింది. మొక్కజొన్న మొలకలు బూమిలనే మగ్గిపోయినయి. నారు మళ్లల్ల నీళ్లులేక మలమల మాడిపేంది. పెసర చేను పూత సగానికంటె ఎక్కువ రాలిపోయింది. అదేం చిత్రమోగని కావాల్ననుకొన్నప్పుడే మొ ఆనరాదు. అద్దన్నప్పుడు అగ్గి అయి కురిసి అంత నాశనం పదారుపాళ్లు చేత్తది.

'బగు మంతుడనెటోడే ఉంటె గిట్ల అన్నాయం ఎందుకు చేత్తడు' అన్నడు గట్టునర్సు పెసరకాయ తినుకుంట.

'కాదురా లోకంల పాపం ఎక్కువై పోతా ఉంటే, గిట్లనే ఆనలు కరువయి, అగ్గికురుత్తది.' పొగాకు సుట్టల నిప్పుకుక్కుంట అన్నడు కత్తులు.

'ఆఁ! నువ్వు చెప్పింది నిజం' అని అటుజూసి 'ఓ కత్తులు మామా అటు జూడూ, మన జాంకిసన్ రావు దొర కండ్లన్ని గంగిమీన్నే ఉన్నయి. ఎప్పుడేం జేత్తడో తెలువదు' అన్నడు గట్టునర్సు ఎండిన పెసరకాయను బుట్టల పోసుకుంట.

'ఆయన కండ్లల్ల పడ్డది ఇదువరకు ఎవ్వతె తప్పిచ్చుకొన్నది సెప్పరాదూ? కని గంగి...' అంట ఆగిండు కత్తులు.

'ఎట్లనయిన సూడుదాని దురదృట్టం. పెండ్లి అవుడు, అయినంక నెలకు అత్త గారింట్ల అడుగు పెట్టుడు, ఆనాడే పెనిమిటి చచ్చుడు అంటె ఎంత ఇది? బగుమంతుడనేవోడె ఉంటె గిట్ల అన్నాయం ఎందుకు చేత్తడు సెప్పుమామా'

'కాదురా గట్టునర్సూ. ఈ గంగి అత్త గారింట్ల అడుగుపెట్టంగనే బజార్ల ఎవ్వలో తుమ్మిండ్రట. అంతకు ముందే రెండురోజులు అయిందట దీని మొగనికి జరమొచ్చి. ఇది పోయిన్నాడు మూడోదినం శాప్! ఇంతెందుకంటవు ఆ బామ్మడు పెండ్లి మూర్తం సరిగ్గ చూసి పెట్ట లేదేమొ. శానమందిగిట్లనే అనుకొన్నరు. నచ్ఛత్రం మంచిదిగాకుంటే గట్లనే అయితదిగాదు' అన్నడు కత్తులు.

'మరి మన బాలకిసన్‌రావుదొర చిన్న చెల్లె పెండ్లి మూర్తమయితే ఎక్కడి మంచో తెప్పిచ్చిన బొమ్మలతోటే మూర్తం పెట్టిచ్చిరి. పదారు పండుగొంక ముందే ఆమె మొగడు జరిగిపోయె. ఇదేంది మరి. అసలు బగుమంతుడనెటోడు...'

'ఏమొరా, నీ తోటి గెల్వుడు మాకట్లం' అని నడుమనే ఆపిండు కత్తులు.

'అగో అటు సూడు. రంగరాజుతోటి మన దొర ఏందో చెప్తాండు గంగిదిక్కు చూసుకుంట' అన్నడు గట్టునర్సు.

రంగరాజు బాలకిసన్‌రావు దొర వాత (వ్యవసాయం) చేయించుతడు. రంగరాజు దగ్గర అన్ని అవలచ్చనాలున్నయి. రంగరాజు గాలమేసి చాపల పడ్తడు. దొర, రంగరాజు ఇద్దరుగూడి అనుబగిత్తరు.

పెసర చేనుకు జర దూరం నుంచి సర్కారు సడకుపోతది. సడకు పక్కన కిసన్‌రావుదొర మామిడితోట ఉంటది. మామిడితోట పక్కన పరుపు బండ ఇంక కొన్ని బండరాళ్లున్నయి. పరికల్లం, నువ్వులు దులుపుడు, జొన్నకంకులు కొట్టుడు అన్ని ఆ పరుపు బండ మీదనే చేయించుతడు దొర.

పెసరకాయ కొట్టి పెసళ్లు పొలిపిచ్చి రాశిల పోయించిండు రంగరాజు. ఒక్కొక్కతే పెసళ్లన్ని రాశిలపోసి రంగరాజు పెట్టిన కొన్ని పెసళ్లను గంపల నెత్తి కొని ఊరిమొకం పట్టిండ్రు. ఆనాడు గట్టునర్సు, కత్తులు తప్ప తతిమ్మ పాలేర్లు నువ్వులు అలుక పోయిండ్రు. కత్తులు గట్టునర్సులకు రూపాయిచ్చి కల్లుతాగి రమ్మన్నాడు రంగరాజు. ఇద్దరు గూడి వాళ్ళల్లకు పేండ్రు.

అక్కడ మిగిలిపోయినోళ్లల్ల ఒక్క చిన్న పొల్ల, గంగి ఉన్నది. గంగి పెసర వాయికొట్టుడు అప్పుడే అయిపోయింది. ఆ పొల్లవాయికొట్టి పెసళ్లు రంగరాజు కిచ్చింది. పొల్లగంపల దోసెడు పెసళ్లు పోసి ఎల్లుమన్నడు రంగరాజు. పొద్దు మూకి శానసేపయింది. అంత చీకటి పడ్డది.

'రంగరాజా చెప్పనపో ఇక్కణ్నుంచి. కత్తులు గట్టునర్సు వస్తారు. నేను ఏసి సంగతి సూస్తాను' అన్నాడు దొర.

'అయ్యో నా గంప ఏది' అని అడిగింది గంగి.

'ఎక్కడ పెట్టినవు పిపలన్న తీసుక పోయిండ్రో ఏమొ లేకుంటే నిన్ను గిమ్మతు చెయ్యాల్నని ఏ బండ సాటునన్న దాచిండ్రేమొ' అని నవ్వుకుంట. ఎల్లిపేండు రంగరాజు.

సడకు మీనగప్పుడే ఓలారీ ఎల్లిపేంది. ఆ జెంక అంతా చిమ్మ చీకటి అయిపోయింది. గంగి గంప కోసం ఆబండ ఈబండ సాటున సూత్తాంది.

జర దూరాన దొర పాలేర్లు, ఎడ్లు అచ్చే సప్పుడు ఇనత్తాంది. కని దొర మెద డుల ఇంకోటి మెదుల్తాంది.

తాటితోపు దగ్గరినుంచి రాంగా కత్తులు "అప్పుడు మనం రాంగా ఒక్క గంగే ఉన్నది" అన్నడు. 'అహాఁ! బైరి బిడ్డ కూడ ఉండె' అన్నాడు గట్టునర్సు. 'ఎవ్వలుంటె ఏంది. జెప్ప జెప్పనడువ్.' 'మెల్లంగ నడువు చీకటి ఉన్నది. ఈవరకు పాలేర్లు కూడ అచ్చిండ్రు కావచ్చు. గంగి అన్న కూడ ఉంటడు కదా గంగికేం బయం?' అన్నడు గట్టునర్సు 'నిజమే కాదరా' అన్నడు కత్తులు.

గంగి బండబండకు సూసింది. గంప కనిపియ్యలేదు ఇంకో బండదిక్కు పేంది. ఎనుకనించి దొర బుజాల మీద చేతులు ఏసి గట్టిగా పొట్టుకున్నడు గంగి 'ఛీ! ఛీ!' అను కుంట గుంజుకోబోయింది. నెయ్యి ఇడిపిచ్చుకోని ఒక్క దెబ్బ పెట్టింది దొర చెయ్యిమీద. అయినా ఇడుపలేదు. మల్ల తనదగ్గరికి గట్టిగ గుంజుకొబోయిండు. గంగినంతా అదిమి పట్టిండు దొర. అంతట్లనే కత్తె తోటి తలమీద ఒక్క దెబ్బ తాకుడుతోటే 'అమ్మా' అనుకుంట కిందపడ్డడు దొర.

* * *

'అరె! కిందపడ్డడు' అన్నడు ఒకడు. తక్కినోళ్లు అందరు లేచి ఉరికిండ్రు. బగ్గ కల్లు తాగిన నిషాల కొండడు మాత్రం లేచి ఉరుక లేదు. 'కిందపడ్తె ఏంది మీన పడ్తె ఏంది?' అనుకుంట నవ్వుడు మొదలు పెట్టిండు.

తాటిచెట్టు సగం నుంచి గుదితెగి గొల్లు జారి కిందపడ్డ భూములు గౌడను పట్టు కొచ్చి కల్లుమండువా దగ్గర పడుకో బెట్టిండ్రు. ఊళ్లెకురికి కొందరు కోడి గుడ్లు, కోడిపుంజు తెచ్చిండ్రు. భూములు గౌడుకు గుడ్లు తాగిచ్చి, కోడిపుంజు చుట్టు తింపి తాటితోపు మైసమ్మకని కల్లువంచి మొక్కిండ్రు.

'ఈ గౌండ్ల పని కట్టమే' అన్నడు ఒకడు.

'కట్టంగాదేమరి. గౌడు తాటిచెట్టు ఎక్కి దిగి యింటికొచ్చేదాకా గౌడు పెండ్లాం ముండ అని ఎందుకన్నరు' అన్నడు ఇంకో గడు.

'హా మరి తాడిచెట్టు ఎక్కుడు ఎంత పమానమైన పని' అన్నడు ఇంకొకడు.

భూము గౌడు కింద పడ్డ సంగతి తెలువం గనే తక్కిన గౌండ్లందరూ ఉరుకొచ్చిండ్రు.

'ఎంత అన్యాయం జరిగిపాయె' నన్నడు ఓ ముసలిగౌడు.

'అన్యాయం అంటే ఏంది న్యాయం అంటే ఏంది. నాకు జర చెప్పు' అన్నడు తూలుకుంట కొండడు.

కొండడంటె అందరికీ బయం, బక్తి. కొండని ఆకారం సూత్తెనే సాలు మాట్లాడేది లేదు. పొల్లగాడు పిదాత జాత్తె ఏడుత్తాడు. ఏశాశే పొల్లగాడికి కొండడిపేరు చెప్తె ఊరుకుంటడు.

'నీళ్లాళ్ల నీ కల్లుల పేడ మందు పిల్లు కలిపితే న్యాయమా? మనుష్యులను దోచు తినే సేటు ఒక్క దెబ్బ తాకితే ఏంది?' అన్నడు కొండడు కోపతేసుకుంట.

'మరి నువ్వు సాంగ్లు నీళ్లు కలిపి అమ్ముతలేవా?' అని అనుగద మనుకున్నడు ముసలి గౌడు, కని కొండన్ని సూస్తె పైకి రాలేదు మాటలు.

కొండనికి మూడు బర్రెలున్నయి. పాలు అమ్ముతడు. బర్రెలు ఇక్కడ్రావు దొర కంచెలనే మేత్తయి, మరి కొండడు ఇక్క డ్రావుదొర పాలేరాయె.

'ఇంతకు ఓకాడ న్యాయం ఇంకోకాడ అన్యాయం అయితాంది. మన జిల్లాల్ల కల్లుతాగితే తప్పులేదు. అదే మన ఊరికి అచ్చిండ్రు సూడు గుంటూరు, బెజవాడ నుంచి. వాళ్ల దిక్కు తాగితె తప్పట. జైల్ల పెడ్తరట. మరి వాళ్లది మనది ఒక్కటే తెలుగుదేశం అట. ఈడన్యాయం, ఆడ అన్యాయం. ఏం చెప్తవు ముసలిగౌడా?' అని అహ్హహ్హా అంట నవ్విండు.

'బాగా తాగిండు, ఏమే మొనదుదుతునాడు' అనుకున్నాడు ముసలి గౌడు.

కని తాగినోల్లు శానామంది నిజం సంగతులే మాట్లాడుతరు. ఒక్కటేందంటే వాళ్లు మాట్లాడే ఓసంగతికి ఇంకోదానికి పొంతన ఉండది అంతే!

భూమగాడుకు తెలివచ్చింది. అందరు లోలోపల దేవుణ్ని యాది చేసుకున్నరు. మైసమ్మ తల్లికి మల్లి మొక్కిన్రు.

కొండడు తూలుకుంట ఊరిదిక్కు నడిచిండు. పొద్దు అప్పటికే తల్లికడుపుల పడ్డది. పాలేర్లు, నాగండ్లు, గొడ్లు గోద యింటికి చేరుతాంౘ్రు.

చింతచెట్టుమీన గుడ్డికొంగలు మాలొల్లి చేత్తాన్నయి. చింతచెట్టుమీన గంట కట్టిన్రు. దాన్ని కిందినుంచే తాడుతోటి గుంజితే గంట గనగన మంటది. కొండని కొడుకు ఏడేండ్లోడు తాడు గుంజితే కొంగలు ఇంకింత లొల్లి చేత్తాన్నయి.

'గంగీ' అంట ఒక్క కీకేసిండు కొండడు.

గుడిసె ఎనుక ఉన్న గంగి పెయ్యి ఒక్కసారి ఒనికింది. తాగి అచ్చినప్పుడల్ల కొండడు గంగిని కొట్టుడు అలవాటు. గుడిసె ఎనుక బాయిదగ్గర బొమ్మచెట్టు దగ్గర కల్లి

# నాయమేది?...

నిల్సున్నది గజగజ ఒనుకుకుంట.

కొండడు గుడిసె తడికెకున్న కంక బద్దను తీసి

'ఏహె మాట్లాడదేంది' అనుకుంట లోపలికి పోయిండు.

రెండుపక్కల ఉన్న గుడిసెలల్ల నుంచి ఆడోల్లు చూత్తానే ఉన్నారు. ఆల్లకిది రోజు జూసే బాగోతమేనాయిరి.

బుసలు కొట్టుకుంట కొండడు కంక బద్ద తీసి ఒక్కటి పెట్టాడు.

గంగి 'అమ్మో' అంట కేకేసింది.

కిందపడి గిలగిల తన్నుకొన్నది.

*　　　*　　　*


కిందపడి గిలగిల తన్నుకొన్నది.

'అయ్యో! పాపం చచ్చిపోయిందా'

'ఎంతపని అయిపాయె'

'నీల్లు తీసుకొనిరాండ్రి' అంట జనం అంత జమ అయిన్రు.

అటునుంచి సైకిలుమోటరు ఇటునుంచి లారీ వచ్చేవరకల్లా నడతుదాటే ముసల్ది గాబరాల కింద పడ్డది.




లారీ నంతదూరంలనే పెద్ద కేక పెట్టిచ్చి ఆపి కిందికి దిగిండు గనేసు. ఎనుకనుంచి లారీతోటి ఉండే కీనరు కిట్టయ్య దిగిండు.

'ఈసరయ్యా నీల్లు తీసుకరా' అంట కీకేసిండు గనేసు.

కిట్టయ్య పొయ్యి ఈసరయ్య హోటల్ల నీల్లు తెచ్చిండు. ముసలిదాన్ని సడకు పక్కన చెట్టుకింద పండబెట్టి మొకం మీద నీల్లు చల్లిండు గనేసు. తలివస్తూ జనం అటు యిటు తిరుగుతాంౘ్రు. ఏం జేయాల్నో తోసలేదు. వట్టిగ కీకలు పెడ్తాంౘ్రు.

దాన్నపటికి ముసలిదానికి తెలివచ్చింది. ఈసరయ్య హోటలుకు తీసుక పోయిన్రు. అన్నం తినమన్నడు గనేసు.

'ఇంటిదగ్గర మనవడున్నడు. చిన్న పొల్లగాడు. కొడుకు ఊరికి పోయిండు. ఈ బియ్యం రేషను దుకాణంల కొనుక్కచ్చే వరకల్లా గింత పొద్దెక్కింది. నేనెల్లిపోత, బిడ్డ. అన్నంవద్దు నాకు' అంట రొండు చేతులు మీదికెత్తి మొక్కింది గనేసుకు.

'అన్నం తీసుకపో అవ్వా గింత ఎండల ఎప్పుడు పోతవు, ఎప్పుడు వండుకుంటవు. నీ మనవని కోసమున్న పట్టుకుపో' అన్నడు గనేసు.

ఈసరయ్యతో చెప్పి అన్నం పెట్టిచ్చి పంపిండు గనేసు ముసలిదాన్ని.

'సతంత్రం రాంగనే ఏం లాబం. సరిగ్గ అన్నం దొరక్కపాయె' అన్నడు గనేసు పొయ్యే ముసలిదాన్ని జూసుకుంట.

'సతంత్రమేమొ గని ఇయ్యాల కొద్దిగైతే నువ్వు ఆ ముసలిదానికి టక్కరిచ్చేటోనివే పో' అన్నడు ఈసరయ్య.

'లారీ టక్కరు వేసెవ్వలకు పెట్టలేదు. ఇంకముందు కాదు. టక్కరు పెట్టిన అంటె నేను అప్పుడే సావాలె. అంతే' అన్నాడు గనేసు.

'ఆఁ! అమాట అనకు ఎప్పుడు ఏమయితదో మనకేం ఎరుక' అన్నాడు ఈసరయ్య.

ఈసరయ్య గ్రరెపెల్లి స్టేజి దగ్గర రొండేండ్లకింద చిన్న 'చా' అమ్మే పాక కట్టిచ్చిండు. ఏడాది అయిపోంగనే బజ్జీలు, పూరీలు, పకోడీ అమ్ముడు మొదలు పెట్టిండు, మూడునెల్లనుంచి అన్నం కూడ పెడ్తాండు. సూత్తుండంగ ఈసరయ్య

అంతోడు అయిందిరా.

'ఆకలిగ ఉన్నది ఏదన్న పలారం తీసుక రా' అన్నాడు రమేష.

'పలారం తింటె ఆకలిపోదు అన్నం దిను' అన్నడు ఈసరయ్య.

'అన్నం! అన్నం తిని తిని యాష్టొచ్చింది.'

'ఓరిపి! బియ్యమే దొరుకుత లేవంటే అన్నం తినుడు యాష్టకొచ్చినాది' అడిగిండు ఈసరయ్య నవ్వుకుంట.

'లేకపోతె ఏందీ? ఆ పాడు ముక్కిపోయిన బియ్యం మనకు పోసిరి రేషను దుకానపోల్లు. దొరలకు మంచి మంచి బియ్యమాయె. మద్రాసుకు, కేరళకు మంచి బియ్యం పంపిత్తాండ్రు. మనకేమొ ఆ ముక్కి


# ఫోస్ఫోమిన్ శక్తిని పెంపొం



దించును, ఆకలిని

అధికముచేయును,



సహనశక్తిని



హెచ్చించు

-ను. శరీరము యొక్క

రోగనిరోధక శక్తిని

ఎక్కువచేయును




అవును —
కుటుంబము అంతటికి ఫోస్ఫోమిన్
వల్ల ఆరోగ్యము కలుగును.

ఫోస్ఫోమిన్...బి కాంప్లెక్స్ విటమినులు మల్టిపల్
గ్లిసరోఫోస్ఫేటులగల ఆదువన్న ఎంల్ల రుచిగల టానిక్

SQUIBB® TTT® ® ఇ. ఆర్. స్క్విబ్ & సన్స్, ఇన్కార్పొరేటెడ్ వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కులు చిహ్నం. దీని రిజిస్ట్రర్డు ఉపయోగదారులు కరంచంద్ ప్రేమ్‌చంద్ ప్రయివేట్ లిమిటెడ్

SARABHAI CHEMICALS

shilpi sc 49/67 Tel.

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో మహిళలు

ఆరోగ్య సౌభాగ్యములకు ఆధారపడునది లోధ్ర

66 సంవత్సరములపైగా ప్రసిద్ధినొందినది







కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్

రాయపేట, మద్రాసు-14

ఏజెంట్లు:

సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)

విజయవాడ. సికిందరాబాదు. మధుర.

బరహంపురం. బెంగుళూరు

3 నెలలు ఉచిత బహుమతి



36/-

పంపెదము.

ARVIND AGENCIES (APW-22)

P. B. 1408. Delhi-6.

రు. 20/-లకు ట్రాన్సిస్టర్



రు. 20/-

పొందండి.

CEYLON TRADERS

(WAP-22)

Post Box 1257, DELHI-6.


# నాయమేది?...

పోయిన బియ్యంకూడ సరిగ్గా దొరుకత లేవాయె. పట్నంల మంచి బిర్యాని బియ్యం తినుకుంట ఉండే ఆ మంత్రులకేం తెలుస్తది మన సంగతి. రేషను దుకానమోల్లు మంచి బియ్యం మీ అసుంటి షావుకార్లకు అమ్మిరి. అటు వాడు బతికె. ఇటు మీరు బతికితిరి. నడుమ మావని గోవిందా' అన్నడు గనేసు. అక్కడున్న ఇద్దరు ముగ్గురు 'నిజం నిజం' అని విత్రంగ గనేసు దిక్కు చూసింద్రు.

'పూరి తీసుకరా' అడిగిండు గనేసు.

'పూరి! పూరెక్కడిది. పోదాం అమరి హౌసు' అని నవ్విండు ఈసరయ్య.

'మొన్నొసారి యిటచ్చినప్పుడు పూరి యిస్తివి గద' అన్నడు గనేసు.

'ఆ, అది...' అంట ఆగి పేండు ఈసరయ్య.

'తెలిసిందిలే, బ్లాకుల పెట్టి కచ్చిన పిండిదాల గోదుమలు, పానీ ఇంకే మున్నయి' అంట నవ్వుకుంట అడిగిండు గనేసు.

ఈసరయ్య నెుకల ముదును కొన్నడు. పాలు చెప్పకున్న, లేకపోతె తెమ్మన్కోని 'ఇరానీ' మటన ఉన్నది, అన్నమే తినరాదు 'నేసు' అడిగిండు.

'మరి అప్పట్నుంచి ఎందుకు చెప్పలేదు. ఆరెరె! రెండు సింగల్ పట్రా' అని ఆడేచ్చిండు గనేసు.

అన్నం తినుకుంట గనేసు అడిగిండు, 'ఏం ఈసరయ్యా, హోటలు ఎట్ల నడుస్తాంది. సంపాదన ఎట్లున్నది' అని.

'ఏమున్నది. నువ్వు లారీ నడిపిచ్చి లాబం ఎట్ల తీస్తున్నవొ అట్లనె నేను.' అన్నడు ఈసరయ్య.

'ఈసరయ్యా, నువ్వన్నది నామెదడు కెక్కింది. కని నేను పట్టు డ్రైవరునే. అసుంటి పని నాకు తెలువది. చెప్పినా నమ్మవు కావచ్చు, నా కత నీకు పూర్తిగా తెలువది. నాయం కోసం నేను పాలేరు పని ఇడిచిపెట్టిన. అన్నాయం జూసి ఊరు ఒదిలి పెట్టిన తెలిసిందా' అంట ఆగిండు గనేసు.

ఈసరయ్య అదో తీరుగ సూసిండు గనేసును.

'మూడేండ్ల కింద పెసరచేను ఏరే కాలంల నేను మా ఊరి దొరను కొట్టిన, అందుకు కారణం ఉన్నది. ఒక ఆడదాని మానం పొయ్యే చీకటి పొద్దు. ఆ ఆడది నాకు చెల్లెలు. ఇంతకన్న ఎక్కువేం చెప్పాలె. తర్వాతినుంచి ఆదొరకు పాలేరుగ ఉండనని చెప్పి మానుకున్న. నన్ను సంపె తందుకు, మా చెల్లెకోసం, ఇంక ఎన్నొ కుట్రలు పన్నింద్రు. కసకు మాగాడిసెను కాలపెట్టింద్రు. ఇగ అక్కడ బతుకు తెరువుండదని చెల్లెను తాతను ఎంట బెట్టుకోని బస్తికెల్లి పోయిన. లారి డ్రైవరు నయిన. తెలిసిందా ఈసరయ్యా.'

'మొగడుపొయ్యి ఈ దొచ్చిన పిల్ల నా చెల్లె. దానికి సమ్మంధం చూసిన. పెండ్లి చేసిన సంగతి నీకు తెల్వదేగద' అని లేచి చెయ్యి కడుక్కున్నడు గనేసు.

ఈసరయ్య తుమ్మి తుమ్మి 'కిట్టా దాసూ' అన్నడు.

పాక చూరుల బల్లి పలికింది.

'సచ్చం, చూసినవా' అన్నడు గనేసు.

ఈసరయ్య 'చ్. చ్. చ్.' అన్నడు.

రెండు సింగల్ 'చా' చెప్పిన్నడు గనేసు.

ఈసరయ్య 'చా' తీసుకొచ్చి 'మీ చెల్లె సంసారం ఎట్లున్నది' అని అడిగిండు.

'దాని సంసారానికేంది భేషుగ్గ ఉన్నది. మా బావ కొండయ్యంటె ఊరంత పొగడ్తలు. ఆ ఆకారమే భీకరంగ ఉంటది. దొర లందరికి మా బావంటె ఎక్కడలేని బయం. ఒక్క ఇర్మలావుదొర ఆవు ల్లెమంచోడట. ఆయనకే పాలేరుగ ఉన్నడు. ఇంతెందుకు ఈసరయ్యా, దొరలంటె అందరు పాడోల్లంటరని నేనన. ఇర్మలావు సుంటోల్లుంటరు, కని తక్కువ.' అన్నాడు గనేసు.

'కని కొండడు పెండ్లాన్ని బాగ కొడ్తడు అని సెప్పుతరుగద. అట్ల కొడ్తనే మొదటి పెండ్లాం శానరోజులు పండి సచ్చిపోయిందంటరు గద మాఊల్లె.' అన్నాడు ఈసరయ్య.

'అంత అబద్ధం ఈసరయ్యా. ఒకటి ఉంటె పది చెప్పుతరు మన ఊల్లల్ల. ఏది బస్తీలకెల్లి సూడు, ఎవ్వని పనివాడె సూసుకుంటడు—కొండయ్య బావ మొదటి పెండ్లాం, చచ్చిపోయిందంటె దానికి

కారణం, నువ్వు చెప్పిందేం కాదు. ఆమెకో మొండిరోగము ఉండేది. కడుపుల నొప్పి, దానిలోనే చచ్చిపోయిందని చెప్తరు కొందరు.'

'అయినా పెండ్లాలను కొట్టే మొగలు లేరంటవా?' అని అడిగిండు ఈసరయ్య.

'ఉండరెందుకు. బస్తీలో మా గుడిసె దగ్గరనే ఓ చిన్న డాబా యింట్ల ఉంటరు. ఆమె హైస్కూల్ల పంతులమ్మ. మొగడు ఏదో ఆఫీసుల పని. బాగా చదువుకున్నోడే. దాని ఏం లాబం. వారానికోసారి అన్నా కొడ్తడు. ఆమె పాపం ఎంతో మంచిది. కిక్కురు మనది. ఎంత సదువుకున్నా పెండ్లాన్ని కొట్టెటోడు ఆడు మనిషి కాదు. పసువుకంటె కడ హీనం' అన్నాడు గనేసు.

మల్ల 'మొన్నపోయిన సారి చెల్లె ఊరికి పోలేదు. ఈ సారి కొబ్బరి కాయల నక్కడ దింపి ఇనుప సలాక తీసుకరావాలె. అప్పేటప్పుడు చెల్లెను జూడాలె. అచ్చే పండుక్కి తీసుకపోయి కొత్తచీరె పెట్టాలె నని ఉన్నది' అన్నడు. కండ్లల్ల నీల్లు తిరిగినయి.

ఈసరయ్యా చెప్తుకుంటే గొప్పకాదు గని మా తలిదండ్రులు పోయిన కాన్నించి మా చెల్లెను పువ్వుల్లపెట్టి పెంచిన. దాని దురద్రుష్టం. మొగడు పోయినంక మల్లబొట్టు పెట్టిచ్చిన. నా చెల్లెను చిన్నప్పుడోసారి కొట్టితె గిలగిల తన్ను కొన్నది కిందపడి. దానికి దెబ్బంటే పానం పోయినట్టే. ఇప్పుడు నువ్వు అట్ల చెప్పి నందుకు అంటున్న గని మా కొండయ్య బావే కొడ్తే ఎప్పుడో నా దగ్గరికి ఉరికొచ్చేది' అన్నాడు గనేసు.

'అదివాడు గనేసు. మా ఊళ్లె అను కోంగ ఇంట వేసు మాత్రం సూసిన్నా ఏమన్నావా' అన్నాడు. ఈసరయ్య

కునుకుతీత్తున్న కీనరు కిట్టయ్యను లేపుకుంట 'అట్ల మా బావే కొట్టె మా గంగి ఈ పాటికె ఉరేసుకు సచ్చేది తెలుసా ఈసరయ్యా' అంట లేచిండు గనేసు.

* * *

'ఉరేసుకు సచ్చింది'

'అయ్యయ్యో! ఎంతపని చేసింది'

'పోయిందే మంచిదయ్యింది. పాపం. గొండెడ్లనుంచి ఆ దెబ్బలకు ఎట్ల ఓర్చిందో.'

'అయ్యో తల్లీ! దొరల యిండ్లల్ల పుట్టేదానివి ఈడికి అచ్చి సచ్చినవా తల్లీ' అంట ఆడోల్లు, మొగోల్లు, పిల్లలు ముసలోల్లు కొండని గుడిసె దగ్గరికి పోయిండ్రు.

'గంగమ్మ తల్లీ! ఇంక బతికినట్టే ఉన్నవు గదా అయ్యో బిడ్డ నూరేండ్లు నిండినయా' అంట ఏడ్చింది పక్కింటి ముసలమ్మ.

పొద్దు పొడిచేవరకల్లా గంగి ఉరేసుకు సచ్చిందని ఊరంతా తెలిసింది,

కొండడు ఎల్లి ఇస్త్రాలావు దొర కాల్లు పట్టుకొన్నడు.

ఆనాడు ఊరంతా కొండని గుడిసెదగ్గర జమ అయిండ్రు.

రెండు జాములకు పోలీసు అమీను, జవాన్లు దిగిండ్రు.

పంచనామాకు బస్తీకి తీసికెల్లాలన్నరు. ఇస్త్రాలావు ఎంతో చెప్పి చూసిండు అక్కడికి తీసుకపోవు డెందుకన్నడు. ఎవ్వలమీదా అనుమానంలేదని కొండనితో చెప్పిచ్చిండు.

అయినా ఆ అమీను సాబ్ ఇనలేదు. శవాన్ని బస్తీకి తీసుకపోయి పరీక్ష చేయించాలె నన్నాడు.

పోలీసులతోటె ఇస్త్రాలావుదొర, కొండడు బస్తీకి పోయిండ్రు.

పొద్దు మూకెవరకల్లా గనేసు లారీల కొబ్బరికాయలు దింపి ఇనుప సలాకా ఏసు కొని అచ్చి సడకు పక్కన లారీ ఆపిండు. కీనరు కిట్టయ్య నక్కడే ఉండుమని ఊరి టక్కు కొద్ది దూరం నడిచిండో లేదో తోవ్వల బగలు ఎదురై గనేసుతో జరిగిన సంగతి చెప్పిండు.


'గంగమ్మ తల్లీ' అంట పెద్ద కేక సిండు.

'ఎక్కడున్నది నా తల్లి...అయ్యో...,' కంట ఒక్కటె ఏడ్చిండు. బస్తీకి తీసుక పోయినారని చెప్పిండా మనిషి.

ఉరికొచ్చి లారీల దునికిండు గనేసు. కండ్లపొంటి నీల్లు ధారలు కారుతున్నయి. వాతి అంత కగులుతాంది. కనుమసకైంది. లారీ రైటు ఏసిండు. లారీ జోరుగా పోతాంది. ముందట ఏమున్నదో ఏమో? పెండ్లల్ల నీల్లు, మెదడుల ఉరేసుకున్నట్లు గంగ...

గ్రాపెల్లి ఈసరయ్య హోటలు దాటి పోంది. ద్వారాన రైట్లు, మనుసులు ఉన్నరు. అది గనేసు ఊరిదగ్గర. బాల కిషన్రావుదొర మామిడితోట దగ్గర. గనేసు అటు ఒచ్చేటప్పుడు అక్కడ దొర, రంగ రాజు పోతేర్లు కనిపిచ్చిండ్రు. పెట్లతీర్తం అచ్చిండ్రు. గొర్రెపిల్ల తెగుదిన్న. కల్లు కుండలు లేత్తయి. ప్రతిసాలు జరిగేదిది. గనేసుకు తెలుసు.

పని యిప్పుడు గనేసు ఏదే లోకంల ఉన్నడాయె.



కందీలలు, పెట్రోమాక్సు లైట్లు, ఆ ఎలుగుల అటు యిటు తిరిగేటోల్లు, సడకువిూద ఎవడో గరిడీ సాము చేసే టోడు—అంతా గజిబిజిగ ఉన్నరు జనం. ఈలలు, కేకలు, అరుపులు — ఇవన్నీ గనేసుకు ఇనత్తలేవు. పక్కన కూకున్న కిట్టయ్య 'అయ్యో! అయ్యో!' అని అరుత్తనే ఉన్నడు. లారీ సడకు కిందికి పోనే పోయింది.

'అయ్యో అయ్యో, సచ్చె సచ్చె' అన్న కేకలు,

'పట్టుకోండ్రా డ్రైవరును పట్టు, కోండి' అన్న అడవులతోటి గనేసు ఈ లోకంల పడ్డడు.

అటు జూసేవరకల్లా లారీకింద నుగ్గయి పోయి కొట్టుకుంటాం డొకడు.

'రంగరాజు పాపం సచ్చిపోయినట్టే' అని కేకేసిండొకడు.

'డ్రైవరును పట్టుకోండి' అని అందరు గనేసు దిక్కు చూపిండ్రు.

రంగరాజు సచ్చినా ఇంకెవడు చచ్చినా తనను మాత్రం ఈ చనంలోపలనే సంపు తరు అనుకొని గనేసు చీకట్ల ఉరికిండు. ఎంట పదిమంది వడ్డరు. కని ఎవ్వలకూ గనేసు అందలేదు.

కీనరు కిట్టయ్యను చెట్టుకు కట్టేసిండ్రు.

రంగరాజును బస్తీ ఆసుపత్రికి తీసుక పోదామనుకున్నరు. బతికే ఆశలేదు అని ఇంకొందరన్నరు నడిరేతిరి రంగరాజు పానం పోయింది.

* * *

'పానం పోలేదు; బతికే ఉన్నడు' అన్న డొక ముసలోడు పక్క గుడిసె ముసలమ్మ గనేసు తాత కనకయ్య నోటిదగ్గర తులసీ తీర్తం వట్టుకొని కూకున్నది. కనకయ్య కండ్లు తెరిచేవరకల్లా అక్కడున్నోల్లందరు ఒక్కసారి గట్టిగ మొన తీసుకొన్నారు.

అది అంత పెద్ద బస్తీకాదు. గంగమ్మ చావు శానమందికి తెలిసింది. ఈ గుడిసె పెద్ద లందరు కనకయ్యకు చెప్పాల్నా వద్దా అని తటపటాయించిండ్రు. ముసలోడు ఈ సంగతి ఇనంగనే గుండె ఆగి పోద్దేమో అనుకొని చెప్పొద్దనుకున్నరు. కని వయసు పిల్లగా డొకడు జెప్ప జెప్ప అచ్చి ఈ సంగతి చెప్పేవరకల్లా కనకయ్య గుండె ఆగినంత పనిచేసింది. గుడిసెలనుంచి లగెత్తుకొచ్చిండ్రు.

కనకయ్య మాత్రం సావలేదు. కండ్ల పొంటి నీల్లు సన్నంగ కారవట్టినయి.

పదిరోజుల లోపలనే గనేసును పోలీసులు వట్టుకొన్నరు.

బాలకిసన్‌రావుదొర కేసు నడిపిచ్చిండు.

బాలకిసన్‌రావుదొర వున్యాన కచ్చీర్ల కొసకు తీర్పిచ్చిండ్రు.

గనేసు ముందు దొరను వట్టిగానే కొట్టిండని, తన గుడిసె కాలిపోతే అది రంగరాజు పనే అని రంగరాజును సంపే టందుకు పయత్నం చేసిండని, మద్య మద్యన ఎన్నోసార్లు దొరను, రంగరాజును సంపేటందుకు పయత్నంచేసి కొసకు లారీ టక్కరు అనే పేరువిూద రంగరాజును సంపిండని, పీసమెత్తుల దొర తప్పిపోయిండని, రంగరాజును సంపి వెంటనే పారి పోయిండని అందుకు శిచ్చ—పెద్ద శిక్ష ఏసిండ్రు.


గనేసు ఏం మాట్లాడలేదు. కండ్లనుంచి రెండు సుక్కలు రాలినయి. అండ్ల ఎన్ని వెయ్యిల కోట్ల ఆలోశన్లు ఉన్నయో బగమంతునికే తెలువాలె.

సరిగ్గ అదే తారీఖున ఇక్కడలావు దొర వున్యాన కొండన్ని ఇడుదల చేసిండ్రు.

గంగి శవాన్ని పరీచ్చ చేసినంక దెబ్బ లున్నట్టు డాక్టర్ చెప్పుడుతోటే కొండన్ని పోలీసులు పట్టుకొన్నరు.

గంగి ఉరిపెట్టుకొన్నది కొండడు కొట్టిన దెబ్బలకుగాదు, అంతకు ముందు దానికి ఒక రోగము ఉండేది. ఆ బాధకు ఆగలేక ఉరేసుకు సచ్చింది. కొండనిది తప్పేవిూలేదు అని తీర్పు చెప్పిండ్రు.

బాలకిసన్‌రావుదొర వరిపాలం కోతలు పట్టిండ్రు.



ఒడ్డువిూన కూకున్న గట్టు నర్సు 'కచ్చీరుకు ఒక్క చెవ్వులు తప్ప కండ్లు ఉండయి. ఏమంటవు మావా' అడిగిండు.

'ఏమనాలె అందరు అవేది అనుకోవేది గదేనాయె' నన్నడుకత్తులు.

'కొండడు గంగిని సంపిండు కని గనేసు రంగరాజును సంపాల్నని సంపలేదు ఏవంటవు' అడిగిండు గట్టు నర్సు.

'గంగి ఉరేసుకున్నది అని అందరు చెప్పుకుంటే నువ్వేమొ కొండడు సంపిండంట వేందిరా. రంగరాజును సంపాల్నని సంపినా సంపవచ్చు గదా గనేసుకు ఏమకటి పగ ఉండనే ఉన్నదాయె' నన్నడు కత్తులు.

'నువ్వు కొద్దిగ తెలివిమంతుడవను కున్న కత్తులు మావా—కొండడు రోజ కొట్టే దెబ్బలకు గంగిగాని ఎండేండ్ల సంసారం చేసింది గని ఇంకొగల్ల అయితే ఎన్నడో సచ్చేది. లేకుంటే అన్ని ఇడిచి పెట్టేదని మా మేనమరదలు చెప్పింది— నేను చెప్త ఇను. కొండని వలాన గంగి సచ్చింది. గంగి ఆలోచన్లపడి లారి నడిపి నందుకు రంగరాజు సచ్చిండు. రంగరాజును గనేసే సంపిండని మన దొర వున్యాన గనేసుకా శిచ్చేసిండ్రు. అక్కడ బస్తీల గనేసు తాత ఒక్కడు ఎట్ల ఉన్నడో, సచ్చిండో మనకు తెలువది. ఇన్నిటికి కారణం కొండడు. కని అనివిూన్నే ఈగ వాలలేదు. ఏ పాపం ఎరుగని గంగి, గనేసు కేమొగా శిచ్చ? బగమంతుడనే టోడే ఉంటె గిట్ల అన్యాయం ఎందుకు చేత్తడు.' అన్నడు గట్టు నర్సు మొగులు దిక్కు సూసుకుంట.

'ఇంతకు నువ్వేమంటవు కచ్చీరు కొండనికైనా గనేసు విూన్నైనా చెప్పింది నాయమంటవా అన్యాయమా?' అడిగిండు కత్తులు జెకుముకి కొట్టుకుంట.

'అదేకద మావా, నాకు తెలువంది. నాయమంటే ఏందో అన్యాయం అంటే ఏందో' అన్నడు గట్టు నర్సు.

ముండ్లకంపను ఓ దగ్గర కుప్పచేసి నిప్పంటిచ్చిండు కత్తులు. ముండ్లకంప తోటే పసువులు తినే ఎండిన వరిగడ్డి పోసలు కలిసి అంటెత్తు మండినయి. గడ్డి పోసలు నుసి అయినయి. ముండ్లుమాత్రం మాడిపోయి అట్లనే ఉన్నయి. ●